క్లుప్తంగా

డ్వామా ఏపీడీగా విజయలక్ష్మి



కంచికచర్ల: కంచికచర్ల ఎంపీడీఓగా పనిచేస్తున్న బీఎం విజయలక్ష్మి పదోన్నతిపై నందిగామ డ్వామా ఏపీడీగా నియమితులయ్యారు. వమిడిముక్కల మండల డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు పదోన్నతిపై కంచికచర్ల ఎంపీడీఓగా బదిలీపై రానున్నారు.

నేడు వలంటీర్ టీచర్లకు శిక్షణ

పెనుగంచిప్రోలు:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ టీచర్స్‌కు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3800 మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు మొత్తం 380మంది వలంటీర్ టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వలంటీర్ టీచర్లంతా తప్పక హాజరుకావాలని సూచించారు.

మరమ్మతులకు నోచుకోని మైత్రి రోడ్డు



పెనుగంచిప్రోలు:ఇటీవల సంభవించిన వరదలకు మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని మైత్రి రోడ్డు దారుణంగా దెబ్బతింది. వరదలకు చెరువు అలుగులు పొంగి ప్రవహించడంతో సుబ్బాయిగూడెం రోడ్డు నుంచి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్దకు వచ్చే మైత్రి రోడ్డంతా కోతకు గురైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. గ్రామంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయానికి వచ్చే వాహనాలను ఈరోడ్డులోకి మళ్లిస్తారు. ముఖ్యంగా అమ్మవారి ఉత్సవాల సమయంలో ఈ రహదారి గుండానే వాహనాలను ఆలయం వద్దకు అనుమతిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుకు సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ముందస్తు పరీక్షలతో వ్యాధుల నిర్ధారణ



నందిగామరూరల్: స్వస్థ నారీ–శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పెద్దవరం, సోమవరం గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారలుఉ విజయకృష్ణ, గౌతమి మాట్లాడుతూ ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని గుర్తించవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ తర్వాత సకాలంలో వైద్యం తీసుకుంటే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు. అనంతరం బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దవరం సర్పంచ్ చిన్నదేవి, ఎంపీటీసీ సభ్యుడు సింగంశెట్టి నాగేశ్వరరావు, వైద్యరోగ్య సిబ్బంది బిక్షాలు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సరోజిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, ఏఎన్‌ఎంలు, అంగనవాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు



గౌరవరం(జగ్గయ్యపేట): అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యసేవలు పొందాలని భూచవరం వైద్యాధికారి కీర్తిరెడ్డి సూచించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో స్వస్థ నారి..శశక్తి పరివార్‌లో భాగంగా శుక్రవారం మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి, సర్పంచ్ పావని వెంకటేష్, సొసైటీ చైర్మన్ కట్టా నరసింహారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రూపవతి సూచించారు. జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మురుగునీటి పారుదల, డ్రైన్‌ల పూడికతీత పనులు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు.

కొత్త పింఛన్ల మంజూరు ఎప్పుడో!

- 15నెలలుగా తెరుచుకోని వెబ్‌సైట్
- పింఛన్ కోసం అర్హుల ఎదురుచూపులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- వృద్ధులకు దక్కని ఆసరా

వత్సవాయి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలను గుప్పించి ప్రజల నుంచి ఓట్లను దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలును గాలికొదిలేశారు. ముఖ్యంగా 15నెలలుగా కొత్త పింఛన్లు మంజూరు గాక అర్హులు ఇబ్బందిపడుతున్నారు.

కొత్త పింఛన్ల ఊసేది..

సామాజిక పింఛన్లలో భాగంగా వృద్ధులు, వితంతువులకు ప్రతినెలా రూ.4వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6వేలు పింఛన్ అందిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ ఆయా లబ్ధిదారులకు ఆసరాగా నిలుస్తున్నాయి. వీరంతా ప్రతినెల ఒకటో తేదీన వచ్చే పింఛన్ కోసం ఆశగా ఎదురుచూస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15నెలలుగా కొత్త పింఛన్ల మంజూరు చేయలేదు. దీంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో వేలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ అందక అవస్థలుపడుతున్నారు.

అక్టోబర్ ప్రకటన ఉత్తదేనా?..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్త పింఛన్ల ఊసే లేకపోవడంపై దరఖాస్తుదారులు పెదవి విరుస్తున్నారు. కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామంటూ గతేడాది అక్టోబర్‌లో కూటమి పాలకులు ఇచ్చిన హామీ చివరికి ప్రకటనలకే పరిమితం కావడం గమనార్హం. ప్రకటన చేసి ఏడాది అవుతున్నా పింఛన్ల దరఖాస్తు కోసం ప్రభుత్వం కనీసం వెబ్‌సైట్ కూడా ఓపెన్ చేయకపోవడం దారుణమని అర్హులైన పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వృద్ధుడైన భర్త చనిపోతే ఆ పింఛన్‌ను స్పౌజ్ కేటగిరీలో అతని భార్యకు పింఛన్ చేస్తున్నారు తప్ప మరే ఇతర పింఛన్లను మంజూరు చేయడం లేదు.



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికే...

గత ఎన్నికలలో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ కూటమి నాయకులు ఇచ్చిన హామీ గాలికి వదిలేసినట్లేనని బీసీ వర్గాలు విమర్శిస్తున్నాయి. బీసీలను సమన్యాయం చేస్తామని హామీలు ఎటుపోయాయని అడుగుతున్నారు. కొత్త పింఛన్లు లేవు, బీసీలకు 50ఏళ్లకు పింఛన్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి తదితర పథకాల అమలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల మంజూరు చేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గంలో పింఛన్ పొందేందుకు అర్హులైనవారు కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలి..



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల అయినా కొత్త పింఛన్ లేదు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న హామీ ఊసే ఎత్తడం లేదు. ఇకనైనా అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలి.

–నల్లగొర్ల లక్ష్మీనారాయణ, బీసీ సెల్ నాయకుడు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి..

కొత్త పింఛన్ల దరఖాస్తు కోసం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చి సైట్లు ఓపెన్ అయితేనే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకునే అవకాశం ఉంది.

– ఎస్.రాంబాబు, మండల పరిషత్ కార్యాలయ ఏవో, వత్సవాయి

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నందిగామరూరల్: వంట మేస్త్రీలు, కార్మికుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశబుూరు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారామాంజనేయ వంట మేస్త్రీ, కార్మికుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే లక్షలాది శుభ కార్యాలలో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న వంట మేస్త్రీలు, కార్మికులకు ప్రభుత్వ ఆదరణ కరువైందన్నారు. ముఖ్యంగా వంట మేస్త్రీలు, కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించటంతో పాటు ప్రమాదాలలో గాయపడిన, మృతి చెందిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వంట కార్మికులు చేసే పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వంట మేస్త్రీలు, కార్మికులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మౌళి, లక్ష్మీనారాయణ, గోపు రామాంజనేయులు, రామకృష్ణ, సురేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



స్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, ఎం.గాంధీ తదితరులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ హోంగార్డు జక్కులూరి స్వామి (50) గురువారం మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ జక్కులూరి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, నాయకులు మల్లెంపాటి సతీష్, కోనంగి ముక్కంటి, దేరంగుల శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆటోడ్రైవర్లకు బాసటగా వైఎస్సార్ సీపీ నేతలు

సచివాలయ సిబ్బంది తీరుపై ఎంపీడీఓకు ఫిర్యాదు



సచివాలయ సిబ్బంది తీరుపై చందర్లపాడు ఎంపీడీఓ పద్మజ్యోతితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

చందర్లపాడు(నందిగామ రూరల్):ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవకులుగా ఉండాలే తప్ప అధికారపార్టీ నాయకులకు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకునే ఆటోడ్రైవర్లను సచివాలయ ఉద్యోగులు ఇబ్బందిపెడుతుండటంతో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం సమస్యను ఎంపీడీఓ పద్మజ్యోతి దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ చందర్లపాడులోని మూడు సచివాలయాల పరిధిలో ఆటో డ్రైవర్‌లు వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులనే నెపంతో టీడీపీ నాయకుల సూచనల మేరకే సచివాలయ ఉద్యోగులు పలువురు ఆటోడ్రైవర్లను ఇబ్బందిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ వారిని కలిస్తేనే పథకాలా?..

వాహన మిత్ర పథకం పొందాలంటే ఆటో డ్రైవర్‌లు తప్పకుండా టీడీపీ నాయకులను కలవాలని సచివాలయ ఉద్యోగులు చెప్పడమేమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించాలి తప్ప అధికార పార్టీ నాయకులు సూచించిన వారికి కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని ఏ ఒక్కరిని తమని కలిస్తేనే పథకాలు ఇస్తామని చెప్పలేదని గుర్తుచేశారు. ప్రభుత్వాధికారులు అధికారపార్టీ నేతలకు వత్తాసు పలుకుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే న్యాయపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టీడీపీ నేతల సూచనల మేరకు వారిని కలవాలని చెప్పిన సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతోపాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలి..

అనంతర ఎంపీడీవో పద్మజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. ఆటోడ్రైవర్లకు టీడీపీ నాయకులను కలవాలని చెప్పిన సచివాలయ సిబ్బందిని కార్యాలయానికి పిలిచి పలు సూచనలు చేశారు. వాహన మిత్ర పథకానికి సంబంధించి ఆటోడ్రైవర్‌లను ఇబ్బంది పెట్టొద్దని ఎన్ని దరఖాస్తులు వస్తే అన్ని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అర్హత ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లకు మద్దతుగా ఎంపీడీఓను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలగపూడి వెంకటేశ్వరరావు, గుడేటి శ్రీనివాసరావు, షేక్ జానీ తదితరులు ఉన్నారు.

సిమెంట్ తూములు ఏర్పాటు



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శ్మశానవాటికతోపాటు ఎస్సీ, బీసీ కాలనీల్లో మురుగునీటి పారుదల కోసం శుక్రవారం సిమెంట్ తూములు ఏర్పాటు చేశారు. ఆయా పనులను సర్పంచి బొక్కా రవికుమార్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ శ్మశాన వాటికలో మురుగునీరు నిల్వ ఉండకుండా జేసీబీ సాయంతో కాల్వ తవ్వించి ప్రజలు నడిచేందుకు వీలుగా సిమెంట్ తూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇళ్లల్లో వాడుకునే మురుగునీరు నిల్వ ఉండకుండా కాల్వలను తవ్వించి సిమెంట్ తూములు ఏర్పాటు చేశామన్నారు. హిందూ శ్మశాన వాటికలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగింపు పనులు చేపట్టినట్లు వివరించారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మండవ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. నందిగామ ఏసీపీ తిలక్ ఆధ్వర్యంలో శక్తి టీమ్ ఎస్ఐ అభిమన్యు సూచనల మేరకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎస్ఐ హనుమయ్య మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఫోక్సో, సైబర్ క్రైమ్ తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం



అనిగండ్లపాడులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న వెరోనికా



వేములపల్లిలో పోషకాహార వంటల పోటీల్లో పాల్గొన్న పురుషులు

నందిగామరూరల్:పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలతోపాటు పట్టణంలోని అనాసాగరం అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత తదితర అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని గర్భిణీలు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం ప్రాధాన్యంపై వారికి అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాభి, అంగనవాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, తల్లులు క్రమంతప్పకుండా తీసుకోవాలని పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ వెరోనికా సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో తల్లులు, పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. పోషకాహారం ప్రదర్శించడంతోపాటు పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు అదేవిధంగా పెనుగంచిప్రోలులో తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, విమల, నాగమణి, రాజేశ్వరి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు పోషకాహార తయారీ పోటీలు..

వేములపల్లి(కంచికచర్ల): మహిళలకు అన్నివిధాలుగా పురుషులు సహకరిస్తుండటం అభినందనీయమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమా అన్నారు. మండలంలోని వేములపల్లిలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పురుషులకు పోషకాహార వంటల పోటీలు నిర్వహించారుచు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మహిళలు చేసే ఇంటి పనుల్లో కూడా పురుషులు భాగస్వాములు కావడం శుభపరిణామమన్నారు. వంట వార్పు కార్యక్రమంలో కూడా సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు ప్రతినిధులు భాగ్యలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

నందిగామటౌన్:మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి పోరుగంటి నరసింహారావు పేర్కొన్నారు. స్వస్థ నారి.. శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా పలువురు బీజేపీ నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అత్యంత ప్రాధాన్యతనివ్వటమే కాకుండా మహిళా ఆరోగ్యం కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ, నాయకులు గుత్తా బాలకృష్ణ, మహంకాళి కోటేశ్వరరావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందిగామ టౌన్: కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన మేర యూరియాను అందించలేక యూరియా వినియోగంతో క్యాన్సర్ వస్తుందంటూ దుష్ప్రచారం చేస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, కోట కళ్యాణ్ విమర్శించారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య. వైద్యం, వ్యవసాయంతో పాటు అన్ని రంగాలలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించే సుంకాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం యువత ఏళ్ల తరబడి ఎదురు చూస్తోందన్నారు. ముఖ్యంగా ప్రజలు, కార్మికులు దోపిడీకి గురవుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై తీవ్రభారాన్ని మోపుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులకు కనీస వేతనాలు అందించలేని నిస్సహాయ స్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొట్టుమిట్టాడుతున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు కటారపు గోపాల్, చాట్ల రవి, పిచ్చేశ్వరరావు, సయ్యద్ ఖాశీం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై ఉద్యోగులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న రీసోర్స్‌పర్సన్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, నందిగామ పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రీల సామర్థ్యాల పెంపుపై శుక్రవారం వారికి జగ్గయ్యపేట మున్సిపల్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు మాట్లాడుతూ ఘనవ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘంలో ఎంతో కీలకమైనదన్నారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని ఆచరిస్తేనే సంపదను సృష్టించవచ్చన్నారు. మున్సిపల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ జగ్గయ్యపేట, స్వచ్ఛ నందిగామ కార్యక్రమాల విజయవంతానికి ప్రజలు సహకరించాలన్నారు. తడిపొడి చెత్తను వేరుచేసి శానిటేషన్ సిబ్బందికి అందజేయాలని కోరారు. స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయిల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఉద్యోగులు, జగ్గయ్యపేట మున్సిపల్ ఏఈ హనుమంతరావు, శివన్నారాయణ, రీసోర్స్‌పర్సన్లు డి.ఫణికుమార్, వంశీ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి

నందిగామరూరల్: కనకదుర్గమ్మ అమ్మవారి దసరా ఉత్సవాల్లో న్యాయవాదులు భాగస్వాములు కావాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, విజయవాడ బార్ అసోసియేషన్, కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఏకే బాషా సూచించారు. విజయవాడ ఉత్సవ్‌పై నందిగామ బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నందిగామ కోర్టు సముదాయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, న్యాయవాదులు ఈశ్వరప్రగడ జగన్నాధరావు, పింగళి లక్ష్మీనరసింహారావు, బండి మల్లికార్జునరావు, మన్నెం నారాయణరావు, మట్టా ప్రసాద్, అద్దంకి మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీస్థలాల్లో కంపచెట్లు తొలగింపు

జగ్గయ్యపేటఅర్బన్: గృహాల మధ్య ఉన్న ఖాళీస్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. 1, 6 వ వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాలో పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు విపరీతంగా పెరిగి వర్షంనీరు నిల్వ ఉంటుండటంతో దోమలు వృద్ధిచెందుతున్నాయంటూ ప్రజలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయా వార్డుల్లో శుక్రవారం జేసీబీతో ముళ్లకంపలు తొలగించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సూచించారు.

నేటి నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

నందిగామటౌన్: సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణా తరగతులను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో శని, ఆదివారాలలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా తరగతులకు మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, బాబురావు, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, పలువురు నాయకులు పాల్గొంటున్నారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు విస్తృత సేవలందించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న శివన్నారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు

గరికపాడు(జగ్గయ్యపేట):వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సేవలందించడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వారికి నిరంతరం అందుబాటులో ఉండాలని గుంటూరు లాంఫాం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ సూచించారు. గరికపాడులో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను శుక్రవారం ఆయన సందర్శించారు. శాస్త్రవేత్తలతో కలసి వ్యవసాయ క్షేత్రంలోని పంటలు, పశు గ్రామ ప్రదర్శన యూనిట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో వస్తున్న అత్యాధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే రైతులను వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువచ్చి వారితోనే విత్తన ఎంపిక చేయించడంతోపాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీ సామర్థ్య పరీక్షలను కేవీకేలో నిర్వహించాలన్నారు. గృహ విజ్ఞాన విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని కూడా చేపట్టాలని సూచించారు. అనంతరం షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్లపాడు, వత్సవాయి మండలం పెద్దమోదుగపల్లిలో అధిక సాంద్రతతో చేపట్టిన పత్తి ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికిషోర్, శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, ప్రభావతి, వెంకటరెడ్డి, లక్ష్మీకళ, జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప పత్రాల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) సంఘ్ గణవేష్ సప్తాహంలో భాగంగా పట్టణంలో శుక్రవారం స్వయం సేవకులు సంకల్ప పత్రాలను అందజేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సన్నాహ సమాలోచన లక్ష్యాల్లో భాగంగా స్వయంసేవకులు పట్టణంలో పర్యటించి సంకల్పపత్రాలను హిందూ కుటుంబాలకు పంపణీ చేశారు.

రేపు ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశం

నందిగామరూరల్: ఆరు దశాబ్దాలుగా గ్రామీణ వైద్యులు చట్టబద్ధత కోసం ఎదురుచూస్తున్నారని రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డీవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రామీణ వైదుల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21న విజయవాడలోని ఎన్‌సీఏ కళ్యాణ మండపంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామీణ వైద్యులు పడుతున్న సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుట్టం శ్రీనివాసరావు, జీనేపల్లి జ్వాలా నరసింహారావు, వెల్లంకి రాంబాబు, షేక్ రంజాన్ తదితరులు పాల్గొన్నారు.